క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ

నెక్కొండ : కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని టీజీ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. పీఎంశ్రీ ప్రోగ్రామ్‌లో భాగంగా కరాటేలో శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించేలా గురువారం నిర్వహించిన ప్రదర్శనను ఆమె తిలకించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఆటపాటల్లోనే కాకుండా కరాటే లాంటి అంశాల్లోనూ ఆసక్తి పెంచుకుని ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ, ఇతర అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సాఫ్ట్‌బాల్ విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన పదో తరగతి విద్యార్థిని గుగులోతు అంజలిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ కమల కుమారి, కరాటే మాస్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సంగెం : మండలంలో విధులు నిర్వహించి ఆత్మకూరుకు బదిలీ అయిన సందర్భంగా ఎంఈఓ నక్క విజయ్‌కుమార్‌ను స్థానిక ఎంఈఓ రాము, ఉపాధ్యాయులు గురువారం శాలువాలు, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాము మాట్లాడారు. అంకితభావంతో పని చేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు విజయ్‌కుమార్, శ్యాంసుందర్, సుజన్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నల్లబెల్లి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర త్రైతశకం 47వ సంవత్సరం తెలుగు ఉగాది క్యాలెండర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఆబిద్ అలీ, పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య గురువారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాశ్ ఆచారి మాట్లాడారు. త్రైత సిద్ధాంతంలో భగవద్గీతను సరలమైన రీతిలో పొందుపర్చారని చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు రావణాచారి, శరత్, కిరణ్ ఆచారి, విక్రమాచారి, పద్మ, అక్షయ, శశిరేఖ, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లికి చెందిన ఉత్తరేణి నరేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి పదో తరగతి నాటి స్నేహితులు, ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ మిత్రులు కలిసి గురువారం రూ.61 వేల సాయం అందజేశారు. తొలుత నరేశ్ చిత్రపటానికి అతడి స్నేహితులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. నరేశ్ మృతితో అతడి భార్య, ఇద్దరు కుమారులు అనాథలయ్యారని కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'గుండాల నర్సయ్య సేవలు మరువలేనివి'



నల్లబెల్లి : కమ్యూనిస్టు నాయకుడిగా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న స్థానిక మాజీ సర్పంచ్, ఎంసీపీఐ(యూ) నాయకుడు గుండాల నర్సయ్య ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సంస్మరణ సభకు సీతారాం నాయక్, సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మాజీ సర్పంచ్‌గా నర్సయ్య గ్రామ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగాని రవి, నాయకులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేశ్, మంద రవి, నాగెల్లి కొమురయ్య, దామ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పూడిక మట్టి.. పంటకు పుష్టి

- పలు గ్రామాల్లో నాలుగేళ్లుగా..
- 'ఉపాధి' పనులతో తరలింపు



చెరువు మట్టిని ట్రాక్టర్లల్లో నింపుతున్న కూలీలు, రైతులు

నెక్కొండ : రైతులు వేసవి కాలంలో చెరువుల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలించుకోవడం పరిపాటి. చెరువు మట్టిలో సాగు భూములకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉండడమే అందుకు కారణం. ఒండ్రుమట్టి వల్ల పంట పొలాలకు కలిగే లాభాలను రైతులు అందిపుచ్చుకుంటున్నారంటూ అతిశయోక్తి లేదు. మండల రైతులు తమ సాగుభూములను ఒండ్రుమట్టితో సారవంతం చేసుకునేందుకు పోటీపడుతున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలంలోని నెక్కొండ, చంద్రుగొండ, దీక్షకుంట, అప్పల్‌రావుపేట, అలంకానిపేట, తదితర గ్రామాల్లో నాలుగేళ్లుగా చెరువుల్లో పూడికతీత పనులు కొనసాగుతుండడంతో రైతులకు ఎరువుల వినియోగం, పెట్టుబడి తగ్గుతుండడంతోపాటు భూములు సారవంతం అవుతున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

నేల పైపొర తయారు కావడానికి దశాబ్దాలవేల సంవత్సరాలు పడుతుంది. వర్షాలకు భూమిలోని పోషకాలు కొట్టుకుపోయి చెరువులు, కుంటల్లో నిక్షిప్తమవుతాయి. చెరువుల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని పొలాల్లో వేయడంతో అనేక లాభాలున్నాయి. పూడిక మట్టిలో నీటిని, తేమను పట్టి ఉంచే గుణం ఎక్కువ. వర్షపు నీరు, తడులుగా అందించి నీటిని మట్టి పట్టి ఉంచి పైర్లకు ఎక్కువ రోజులు అందిస్తుంది. పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. పూడిక మట్టిలోని పోషకాలు ప్రధాన పంటకు అందుబాటులోకి వస్తాయి. ఇసుక నేలల్లో, తక్కువ సారమున్న నేలలకు పూడికమట్టి కీలకం.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి



రసాయనిక ఎరువుల వినియోగంతో సాగు భూములు సారం కోల్పోయిన క్రమంలో ఉపాధి హామీ పథకం కింద పూడిక మట్టిని తరలిస్తుండడంతో భూముల స్వభావాలు మెరుగుపడుతున్నాయి. అధికారుల కార్యాచరణ, రైతుల్లో చైతన్యంతో మండలంలో పూడిక మట్టి వినియోగం పెరిగి నేలకు పోషకాలు అంది పైరు ఎదుగుదలకు దోహదపడుతుంది.

– ఎగిడి నాగరాజు, ఏఓ

సేంద్రియ కర్బనంగా ఎర్రటి, తేలికపాటి నేలలకు ఉపయుక్తం. సారవంతమైన మట్టిని ఏటా పొలాలకు పరిమితంగా వేసుకోవాలి. నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 15–40 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు పూడికమట్టి వేయొచ్చు. తోటల్లో పూడిక మట్టిని వేసిన తర్వాత రొటోవేటర్‌తో కలియదున్ని వానాకాలంలో పంటలు వేస్తే అధిక దిగుబడి ఖాయం.

నత్రజని, పొటాష్ పుష్కలం

చెరువు మట్టిలో నత్రజని, పొటాష్, మెగ్నీషియం, జింక్ పుష్కలం. ఫలితంగా రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. నత్రజని పంట పెరుగుదలకు ఉపయోగపడుతుండగా పొటాష్ తెగుళ్లను తట్టుకునే శక్తి ఇస్తుంది. చెలక భూములకు చెరువు మట్టి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



నెక్కొండ : బాలింతలు, గర్భిణులు, తదితరులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ మధురిమ

- సీడీపీఓ మధురిమ

నెక్కొండ : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ మధురిమ కోరారు. మండల కేంద్రంలోని ఓ స్కూల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఇతర సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగమ్మ, హేమలత, నజీమా, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యుడు రాకేశ్ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో 'సఖి' సేవల సద్వినియోగం

- లీగల్ కౌన్సిలర్ శోభారాణి



మాట్లాడుతున్న లీగల్ కౌన్సిలర్ శోభారాణి

పర్వతగిరి : మహిళలు, బాలికలు అవగాహన కలిగి ఉండడం ద్వారా సఖి కేంద్రాల్లో లభిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోగలరని లీగల్ కౌన్సెలర్ శోభారాణి స్పష్టం చేశారు. మండలంలోని చింత నెక్కొండ, పర్వతగిరి గ్రామాల్లో సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు గురువారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం సఖి కేంద్రాలు ఏర్పాటు చేశాయన్నారు. తద్వారా సమస్యల్లో ఉన్న మహిళలు, బాలికలకు ఉచితంగా కౌన్సిలింగ్, పోలీస్, న్యాయ, వైద్య, తాత్కాలిక వసతి లభిస్తాయని చెప్పారు. బాధితులు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఈనెల 20న తలపెట్టిన తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) నాల్గో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి కోరారు. మహాసభల కరపత్రాలను స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి చిక్కూచిగా ఫ్రంట్ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. దోపిడీ, పీడన, అసమానతలు లేని నీళ్లు, నిధులు, నియామకాలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని పోరాడుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, నాయకులు చింతకింది శ్రీనివాస్, కందికొండ కుమార్, భద్రయ్య, జేతురాంనాయక్, శ్రీనివాస్, ఈదుల వెంకటేశ్వర్లు, రామయ్య, హన్మకొండ ఆనంద్, సాంబరాజు మల్లేషం, చలం, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను నిర్లక్ష్యం చేయొద్దు

వర్ధన్నపేట : వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ వెంకటరమణ స్పష్టం చేశారు. మండలంలోని కట్ర్యాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు కాలనీల్లో తాగునీటి సరఫరాను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటికీ తాగునీటి సరఫరాపై వాటర్‌మెన్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని 8 చేతి పంపులు, 3 బోర్ బావుల వినియోగంతో సమృద్ధిగా తాగునీటి సరఫరా అవుతున్నట్టు తెలుసుకుని అభినందించారు. తాగునీటి సరఫరాలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు.

వడ్డీ రహిత రుణాలు అభినందనీయం

- ఆశాజ్యోతి సమాఖ్య అధ్యక్షురాలు హైమ



సమావేశంలో మాట్లాడుతున్న హైమ

నర్సంపేట : మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు అందించడం అభినందనీయమని ఆశాజ్యోతి సమాఖ్య అధ్యక్షురాలు హైమ అన్నారు. చెన్నారావుపేటలోని సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కోరం లేని కారణంగా సమాఖ్య ఎన్నికలు వచ్చే నెల 6కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ మాట్లాడుతూ వడ్డీ రహిత రుణాలపై మహిళా సంఘాల సభ్యులందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వడ్డీ లేని రుణాన్ని సభ్యురాలి ప్రత్యేక ఖాతాకు సంఘం ద్వారా జమ చేయాలని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ముందుకొచ్చిన మహిళలకు విధి విధానాలను అనుసరించి సీఈఓ ప్రత్యేక అవకాశం కల్పించాలని చెప్పారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో కుట్టించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో అప్పగించాలని తెలిపారు. సమావేశంలో సీసీలు మంజుల, శ్రీలత, మాణిక్యం, ఎంఎస్‌ఏ రజిత, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయండి

- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట : హనుమకొండ జిల్లా పరిధిలోని ఎలకతుర్తిలో ఈనెల 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రజతోత్సవ సభకు సంబంధించి గురువారం వాల్ రైటింగ్ చేయించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ, యువరాజు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తో అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలను విస్మరించి స్వార్థపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ దుష్టపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునే దిశగా సభలో కేసీఆర్, ఇతర అగ్రనేతలు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. సభకు పట్టణం నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెన్నముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండి రమేశ్, నాయకులు మండల శ్రీనివాస్, అప్పాల సుదర్శన్, రావుల సతీశ్, సారంగపాణి, నాయిని వేణుచంద్, పైసా ప్రవీణ్, బీరం అనంతరెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలో గోధుమల మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ ఎల్లావుల లలితాయాదవ్ మాట్లాడారు. తొలుత సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు అన్నమనేని అప్పారావు, మార్గం బిక్షపతి, గుజ్జ గోపాల్‌రావు, ఎలేందర్‌రెడ్డి, తూల్ల కుమారస్వామి, తోటకూరి రాజమణి, ఎండీ అజీమ్, మార్త సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే

దుగ్గొండి : ఇటీవల కురిసిన అకాల వర్షానికి జరిగిన పంట నష్టంపై మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మాధవి గురువారం సర్వే చేశారు. మండలంలోని రేకంపల్లి, లక్ష్మీపురం, మందపల్లి, పీజీతండా గ్రామాలను గురువారం ఆమె సందర్శించి దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పంట నష్టం వివరాలపై అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. సర్వేలో ఏఈఓలు హన్మంతు, వైజయంతి, విజయ్‌నాయక్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు గుడ్ ఫ్రైడే వేడుక



కాళ్లు కడుగుతున్న ఫాదర్ రాజా

గీసుకొండ : మండలంలోని మరియపురంలోని చర్చిలో ఫాదర్ రాజా గురువారం ముందస్తు గుడ్ ఫ్రైడే వేడుక నిర్వహించారు. ఫాదర్ రాజా చర్చిలో 12 మందికి కాళ్లు కడిగి బ్రెడ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు శిలువ వేయబడిన అనంతరం సమాధి చేయబడిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. యేసుక్రీస్తుకు శిష్యులుగా ఉన్న 12 మందిని స్మరిస్తూ గుడ్ ఫ్రైడే ముందు రోజున రోమన్ క్యాథలిక్ చర్చిల్లో 12 మంది కాళ్లు కడిగి వారికి బ్రెడ్ అందించడం ఆచారంగా వస్తోందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ కిషన్‌నాయక్

- ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ గుగులోతు కిషన్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన బడిబాట కార్యక్రమ బ్యానర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సరైన అర్హతలు కలిగిన టీచర్లు పని చేస్తున్నారని చెప్పారు. నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు అనేక సదుపాయాలు కల్పిస్తోందని వివరించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు గారె కృష్ణమూర్తి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ సహాయ కార్యదర్శి సాంబయ్య



వినతిపత్రం ఇస్తున్న సాంబయ్య, నాయకులు

రాయపర్తి : మార్కెట్ యార్డుల్లో పని చేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్యకు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సాంబయ్య మాట్లాడారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రాయపర్తి సబ్‌మార్కెట్ యార్డులో సుమారు 12 ఏళ్లుగా 50 మంది హమాలీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. కార్మికులకు లైసెన్స్‌లు, గుర్తింపు కార్డులు, యూనిఫారం అందజేయడంతోపాటు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పీరని భిక్షపతి, నాయకులు గద్దల కృష్ణ, చందు రవి, సంగెం రాములు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో రిమాండ్

సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలోని శ్రీరామలింగేశ్వర పురుషుల పొదుపు సంఘం కార్యాలయంలో చోరీ చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన కడారి అనిల్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈనెల 15న సంఘం కార్యాలయంలో రూ.10 వేల నగదు చోరీకి గురైంది. సంఘం అధ్యక్షుడు బయ్యగోని ఎల్లగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని గుర్తించారు. గ్రామానికి చెందిన అనిల్ 15న మధ్యాహ్నం పొదుపు సంఘం పరిసరాలను పరిశీలించి చోరీకి రెక్కి నిర్వహించినట్టు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు. అనిల్ రాత్రి కార్యాలయానికి వెళ్లి సీసీ కెమెరాలు, తాళం పగులగొట్టి టేబుల్ డెస్క్‌లో ఉన్న రూ.10 వేల నగదును అపహరించినట్టు చెప్పారు.

గ్రామాల విలీనంతో 'ఉపాధి'కి దూరం

- వ్యకాస జిల్లా కార్యదర్శి సమ్మయ్య

నర్సంపేట : గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో గ్రామీణ పేదలు ఉపాధి హామీ పనులకు దూరం అవుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య ఆందోళన వెలిబుచ్చారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో రుద్రారపు లక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మహిళా కూలీల సమావేశానికి సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ పథకంలో పల్లెల్లో పేదలు ఉపాధి పొందుతుండగా ప్రభుత్వం గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో జాబ్ కార్డులు కలిగిన 4200 కుటుంబాలకు చెందిన 7500 మంది కూలీలు పనుల కోసం పట్టణాలకు వలస పోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ఇతర ఆదాయ వనరులు, ప్రత్యామ్నాయం లేని సదరు వ్యవసాయ ఆధారిత గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం అత్యంత దుర్మార్గమని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు పునరాలోచించి విలీనం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను కొనసాగించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో కూలీలను సమీకరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాల ద్వారా పాలక ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, నాయకులు మొగులూరు శారద, చంద్రకళ, భారతి, జనార్దన్ రెడ్డి, బుడిగె యాదమ్మ, శ్రీలత, విజయ, తారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'స్కూటర్ స్టాండ్‌లో నిబంధనల ఉల్లంఘన'



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న రవి, నాయకులు

నర్సంపేట : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని శ్రీలక్ష్మి గణపతి స్కూటర్ స్టాండ్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని డీబీపీఎస్ వ్యవస్థాపకుడు అందె రవి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మూసి శోభన్, ధరణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఈదునూరి రమేశ్ తెలిపారు. అనుమతి పొందిన దిశలో కాకుండా మరోవైపు దారి ఉన్నా నియమాలు పాటించకుండా మరో మూడు దారులు ఏర్పాటు చేసుకుని ఆర్టీసీ ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నారని తెలిపారు. నిర్వాహకుడు తప్పుడు విధానాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. తొలుత నిబంధనల ఉల్లంఘనపై సమగ్ర విచారణ చేపట్టి నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తడుగుల విజయ్, ఆరెపల్లి బాబు, కోట డేవిడ్, కట్ల రాజశేఖర్, బుట్ట నరేశ్, నేలమారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఉన్నతే కమిటీల లక్ష్యం

నర్సంపేట : బీసీలను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి కమిటీలు వేస్తున్నట్టు బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ తెలిపారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు మూటం కన్ని అధ్యక్షతన గురువారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశానికి రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి బీసీల హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా సేవలు అందిస్తున్న మచ్చిక రాజును ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నట్టు చెప్పారు. అనంతరం మచ్చిక రాజు మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కమిటీ వేసి బీసీలను చైతన్యం చేయడాన్ని బాధ్యతగా భావిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగినేని లోకన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వరంగంటి కవిత, నాయకులు కోడి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నారం మీదుగా హైదరాబాద్‌కు బస్సు

పర్వతగిరి : తొర్రూరు డిపో నుంచి వర్ధన్నపేట మీదుగా ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రముఖ యాత్రా స్థలంగా గుర్తింపు పొందిన మండలంలోని అన్నారం మీదుగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు బస్సు నడిపిస్తున్నట్టు తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు తొర్రూరు బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి అన్నారం గ్రామానికి ఒంటి గంటకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు సాయంత్రం 7 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి అదే రూట్‌లో మధ్యాహ్నం 12 గంటలకు తొర్రూరుకు చేరుకుంటుందని వివరించారు. వర్ధన్నపేట నుంచి నెక్కొండ, నర్సంపేట వెళ్లే ప్రయాణికులు రావూరులో బస్సు దిగి తొర్రూరు నుంచి అన్నారం, రావూరు మీదుగా నర్సంపేటకు వెళ్లవచ్చని సూచించారు. ఆ రూట్‌లో 20 నిమిషాలకు ఒకటి చొప్పున బస్సులు నడుస్తాయని తెలిపారు. వర్ధన్నపేట, అన్నారం పరిసర గ్రామాల ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లే బస్సును వినియోగించుకుని రూట్‌ను కాపాడుకోవాలని కోరారు.